క్లుప్తంగా

రత్నప్రసాద్‌కు సన్మానం

కాకినాడ రూరల్: వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌తో ఉత్తమ అధ్యక్షుడిగా పురస్కారం అందుకున్న బోట్‌క్లబ్ వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్‌ను శనివారం డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, వాకర్స్ రెడ్నం రాజా, బాపిరాజు తదితరులు సన్మానించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో సేవా కార్యక్రమాలు ద్వారా సురిచితుడైన రత్నప్రసాద్, వాకర్స్ క్లబ్ ద్వారా ఎందరో ఆరోగ్యవంతులుగా ఉండేలా నడకపై అవగాహన కల్పిస్తున్నారని ఈ సందర్భంగా అడ్డాల సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కరప: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం మెనూ ప్రకారం రుచికరంగా పెట్టాలని గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణి అన్నారు. మండలం అరట్లకట్టలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. చిన్నారులకు సర్పంచ్ సత్యవేణి స్వయంగా అన్నం తినిపించారు.

అర్హులందరికీ పింఛన్లు

కరప: గ్రామంలో అర్హులైన వారందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో నెలవారీ పింఛన్లు మంజూరు చేస్తామని గ్రామసర్పంచ్ సాదే ఆశాజ్యోతి అన్నారు. కరపలో శనివారం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేసి, ఆమె మాట్లాడారు. గ్రామంలో కొత్తగా 67 మందికి పింఛన్లు మంజూరు కాగా, ఈనెల నుంచి రూ.2750 ఇస్తామని సర్పంచ్ ఆశాజ్యోతి తెలిపారు. గ్రామ కార్యదర్శి వి.సునీల్‌కుమార్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీమా కేసులు పరిష్కరించాలి

కాకినాడ లీగల్: ఈ ఏడాది ఫిబ్రవరి 11న జరుగునున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్స్ కేసులు ఎక్కువ పరిష్కరించాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి , మండల న్యాయ సేవాధికారకమిటీ చైర్మన్ పి.కమలాదేవి అన్నారు. శనివారం కోర్టు హాలులో బీమా కంపెనీ అధికారులు, బీమా కంపెనీ తరఫున కేసులు వేసే న్యాయవాదులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ అదాలత్‌లో బీమా కంపెనీకి సంబంధించిన, ఎక్కువ కేసులు రాజీ చేసేలా కక్షిదారులను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, ఆరో అదనపు జిల్లా జడ్జి ఆర్.వి.నిఖిత పాల్గొన్నారు.

నేటి నుంచి మెగా వాలీబాల్ టోర్నమెంట్

కాకినాడ రూరల్: సంప్రదాయ సంక్రాంతి క్రీడోత్సవాల్లో భాగంగా సర్పవరం పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జేఎన్టీయూకే కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు సీఐ ఆకుల మురళీకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టరును బోట్‌క్లబ్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగం రవి, సభ్యులతో కలిసి శనివారం ఆయన పోలీసు స్టేషన్‌లోని ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు ఆదివారం మధ్యాహ్నం లోపు తమ పేర్లను పోలీసు స్టేషన్ వద్ద నమోదు చేయించుకోవాలన్నారు.

చెరువులో పడి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు కార్తీక్(ఫైల్)

కాకినాడ క్రైం: చెరువులో పడి ఐదేళ్ల బాలుడు విగత జీవిగా తేలాడు. కాకినాడలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా.. జే.రామారావుపేట ఆకాశపువారి వీధికి చెందిన పెమ్మాడి ధర్మారావు, వెంకటలక్ష్మి ఏకైక కుమారుడు ఐదేళ్ల కార్తీక్ శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు ఆడుకోవడానికి వెళ్లాడు. నిత్యం ఇంటి ఆవరణలోనే ఏదో ఒక ప్రాంతంలో ఆడుకునే బాలుడు మధ్యాహ్నం కావొస్తున్నా ఇంటికి చేరలేదు. దీంతో రెండు గంటల పాటు తల్లి వెంకటలక్ష్మితో పాటు బాలుడి నాయనమ్మ కాటవేణి స్థానికుల సాయంతో వెదికారు. మధ్యాహ్నానికి బాలుడి మృతదేహం ఇంటి సమీపంలో ఉన్న చాకలి చెరువులో తేలింది. దీంతో బాలుడిని హుటాహుటిన కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు మృతి చెందినట్టు నిర్ధారించారు. బాలుడి తండ్రి ధర్మారావు అలియాస్ రాజు పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ ఘటనపై కాకినాడ వన్ టౌన్ పీఎస్‌లో కేసు నమోదైంది. కార్తీక్ ఆడుకోవడానికి వెళ్లి జారి పడి ప్రాణాలు కోల్పోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

ఉత్తమ ర్యాంక్ లక్ష్యంగా పని చేయాలి

కాకినాడ సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించే దిశగా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్మార్ట్ సిటీ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ దేశవ్యాప్త పోటీలో గత ఏడాది 101వ ర్యాంక్ సాధించామని, ఈ ఏడాది మరింత మెరుగైన ర్యాంక్ వచ్చేలా పని చేయాలన్నారు.

గొడారిగుంటను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



గొడారిగుంట శాంతనపురికాలనీలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడ నగరంలోని రూరల్ నియోజకవర్గ ప్రాంతమైన గొడారిగుంటను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక మూడో డివిజన్ మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులతో కలిసి శనివారం సాయంత్రం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. శుక్రవారం 100వ రోజు గడపగడపకూ కార్యక్రమాన్ని చేపట్టిన కన్నబాబు కొనసాగింపుగా శాంతనపురికాలనీ, చిన్నశెట్టి బలిజపేట ప్రాంతాల్లో ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అక్కడే ఉన్న కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బందితో పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ అర్బన్ ప్రాంతంలోని రూరల్ నియోజకవర్గాల డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న నవరత్న పథకాలు అందించడంతోపాటు సాంకేతిక కారణాలవల్ల ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. అర్హత ప్రామాణికంగా ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తెలుగుదేశం పార్టీ, ఎల్లో మీడియా దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు నేరెళ్ళ జగన్నాథం, భవానీ, కృప, భువనేశ్వరి, భీమరాజు, కార్పొరేషన్ ఏఈ రమేష్, సచివాలయం సిబ్బంది, మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధునీకరణ పనులు వేగవంతం చేయండి

అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం



అన్నమ్మ చెరువు(బుద్ధవిహార్ పార్కు)ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడ నగరంలోని 24వ డివిజన్ ఘాటీ సెంటర్ వద్ద అన్నమ్మ చెరువు (బుద్ధవిహార్ పార్కు)ను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, స్మార్ట్ సిటీ, డీవీఎంసీ కమిటీ సభ్యులతో కలిసి శనివారం సందర్శించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆధునీకరణ పనుల పురోగతిని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాకినాడ పట్టణం ఘాటీ సెంటర్లో ఉన్న అన్నమ్మ చెరువు ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి 24వ డివిజన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరడంతో ఇక్కడ ఉన్న రెండు వార్డుల ప్రజల తాగునీరు సమస్యలను పరిష్కరించే విధంగా మంచినీటి ట్యాకును మంజూరు చేశామన్నారు. రానున్న 12 నెలలలో మంచి నీటి ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రజలకు తాగునీరు అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. ఇటీవల జరిగిన డీవీఎంసీ కమిటీ(జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానటరింగ్ కమిటీ) సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు సంబంధించి అన్నమ్మ చెరువుకు దగ్గర్లో మద్యం షాపులు ఉండటంతో మద్యం సేవించేందుకు పార్క్ లోపలికి వస్తున్నారన్నారు. ఇక్కడ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. తొలుత ఘాటీ సెంటర్‌లోని భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు కలెక్టర్ కృతికా శుక్లా, డీవీఎంసీ కమిటీ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



కరప సెంట్రల్ లేఅవుట్‌లో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

కరప: రాష్ట్ర ప్రభుత్వం పట్టాలిచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని హౌసింగ్ ఏఈఈ ఎస్.శ్రీనివాస్ కోరారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం కరప సెంట్రల్ లేఅవుట్‌లోని మూడో నంబర్ జగనన్న కాలనీలో శనివారం లబ్ధిదారులతో కలిసి ఆయన పర్యటించారు. గృహనిర్మాణాలపై అవగాహన కల్పించారు. గృహ నిర్మాణాలకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పిస్తామని, లబ్ధిదారులు ముందుకు వచ్చి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. లబ్ధిదారులు అంగీకరిస్తే కాంట్రాక్టర్ ద్వారా పునాది లెవెల్ వరకు సామూహిక నిర్మాణాలు చేయిస్తామని, లేదంటే లబ్ధిదారులే నిర్మాణాలు చేసుకుంటామంటే బేస్‌మెంట్‌లెవెల్ వరకు రూ.55 వేలు మంజూరు చేసి, ఇస్తామని, ఇసుక, సిమెంట్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా సరఫరా చేస్తామని ఏఈఈ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ గుత్తుల భీమశంకరరావు, గ్రామకార్యదర్శి వి.సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాదే లోహిదాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల వసతి గృహానికి కొత్త భవనం నిర్మిస్తాం

కలెక్టర్ కృతికా శుక్లా



వసతి గృహంలో అంధులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: నగరంలోని సాంబమూర్తినగర్ ప్రభుత్వం అంధుల వసతి గృహానికి సంబంధించి కొత్తగా స్థలం కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. శనివారం కాకినాడ ఇందిరాకాలనీలో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమాన్ని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తనిఖీ చేశారు. వసతి గృహం ప్రస్తుత పరిస్థితి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వసతి గృహం గదులు తదితరాలను కలెక్టర్ పరిశీలించి అంధులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ బధిరుల పాఠశాల, ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వికలాంగుల శిక్షణ, ఉత్పత్తి కేంద్రాన్ని సాంబమూర్తినగర్ రెవెన్యూ కాలనీలో ఉన్న ప్రభుత్వ బధిరుల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. బధిరుల బాలిక వసతి గృహం, వికలాంగుల శిక్షణ ఉత్పత్తి కేంద్ర తదితరాలను తనిఖీ చేశారు. ఇందిరా కాలనీలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. ఖాళీ స్థలం తక్కువగా ఉండటంతో పాటు ఇతర సమస్యల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ నేపథ్యంలో అంధుల వసతి గృహానికి సంబంధించి కొత్తగా స్థలం మంజూరు చేస్తామన్నారు. త్వరలోనే సీఎస్ఆర్ ఫండింగ్ కింద నిధులు కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపడతామని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు.

ప్రశాంతంగా ఎస్ఏ-1 పరీక్షలు

కాకినాడ : కాకినాడ డివిజన్‌లో ఎస్ఏ-1 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్టు ఆర్‌జేడీ రాజు తెలిపారు. శనివారం కాకినాడ డివిజన్‌లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన పరీక్షలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కాకినాడరూరల్ మండలంలోని కొవ్వాడ, సర్పవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. కాకినాడ డివిజన్ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి 1నుంచి 10వ తరగతి వరకు 1,39,698 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. ఈ పరీక్షలు ఈనెల 10వతేదీతో ముగుస్తాయన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

12న చెకుముకి జిల్లా స్థాయి పరీక్ష

కాకినాడ: జిల్లాస్థాయి చెకుముకి పరీక్ష ఈనెల 12న నిర్వహించనున్నామని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఎంఎంఆర్ ప్రసాద్, శ్రీరామారావు శనివారం యూటీఎఫ్ భవన్లో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. 21 మండలాల నుంచి సీనియర్ విభాగంలో 8, 9,10 తరగతులకు సంబంధించి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి టీమ్‌కు ముగ్గురు చొప్పున ఒక్కో టీమ్‌ను ఎంపిక చేశామన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే పరీక్షలు నిర్వహించి ఈ ఎంపికలు పూర్తి చేశామన్నారు. 42 టీమ్‌లకు సంబంధించి 126 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఈ చెకుముకి పరీక్షకు జిల్లాస్థాయిలో ఎంపిక పూర్తయిందన్నారు. వీరికి రాత పరీక్షతో పాటు, ఆడియో విజువల్ రౌండ్, ప్రాక్టికల్ రౌండ్, బజర్ రౌండ్‌లను నిర్వహించనున్నారు.

ఫొటోగ్రాఫర్స్ ప్రతిభ అభినందనీయం



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, శివప్రసన్న తదితరులు

కాకినాడ కల్చరల్: ప్రకృతిని అందంగా చిత్రీకరించడంలో ఫొటోగ్రాఫర్స్ చూపించే ప్రతిభ అభినందనీయమని కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ సమావేశపు మందిరంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో కాకినాడ కెమెరా క్లబ్ సౌజన్యంతో శిక్షణ తరగతులు నిర్వహించారు. ముందుగా రాగిరెడ్డి చంద్రకళాదీప్తి జ్యోతి ప్రజల్వన చేసి శిక్షణ తరగతులు ప్రారంభించారు. సభకు అకాడమీ ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఫొటోగ్రఫీ చిత్రీకరణలో ఫొటోగ్రాఫర్ పడుతున్న కష్టం వెలకట్టలేనిదని మరో అతిథి మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అన్నారు. ఫొటోగ్రఫీలో మరింత రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలని అకాడమీ నిర్వాహకులకు మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి సూచించారు. ఫొటోగ్రఫీకి మరింత గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ రామ్మూర్తి అన్నారు. సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన ఫొటోఎగ్జిబిషన్‌ను అతిథులు తిలకించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కోశాధికారి రిషప్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.సురేష్, క్లబ్ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఆర్‌వీఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల ప్రారంభం

కాకినాడ రూరల్: తిమ్మాపురం అవంతినగర్, మారుతీనగర్‌లలో తాగునీటి కుళాయిలను నియోజక వర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బందిలి విరీష శనివారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బెజబాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానికులకు కుళాయి నీటిని అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అవంతినగర్, మారుతీ నగర్‌లలో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కుళాయిలు మంజూరు చేశారన్నారు.

నూతన బోధనా పద్ధతులు అవలంబించాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అధ్యాపకులు నూతన బోధనా పద్ధతులు అవలంబించాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కామన్‌వెల్త్ ఎడ్యుకేషన్ మీడియా సెంటర్ ఫర్ ఆసియా సహకారంతో నిర్వహిస్తున్న 21వ శతాబ్దపు నైపుణ్యాలు, బోధన పద్ధతులు అనే అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపుల ద్వారా అధ్యాపకుల్లో పోటీతత్వం అలవడుతుందన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన కామన్‌వెల్త్ ఎడ్యుకేషన్ మీడియా సెంటర్‌ఫర్ ఆసియా ప్రతినిధి ఎస్.దినకర్‌రెడ్డిను సత్కరించారు.శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

కరప: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లోని ప్రజలు సంప్రదాయ క్రీడలకే ప్రాధాన్యమివ్వాలని, జూద క్రీడల జోలికి వెళ్లొద్దని కరప ఎస్ఐ ఎన్.రామకృష్ణ అన్నారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మూరా అవినాష్ గ్రామస్తులతో కలిసి పాతర్లగడ్డ గ్రామంలోని ఎస్సీ వీధిలో శనివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసి ఎస్ఐ రామకృష్ణ మాట్లాడారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విజేతలైన బుంగా మమతా శివానిప్రసన్న, పులపకూర భవానీ, పులపకూర జ్యోతి, నీలం సూర్యమణి, బత్తిన మేరీలకు తొలి ఐదు బహుమతులు ఎస్ఐ రామకృష్ణ, అవినాష్ అందజేశారు.

సందడిగా సమ్మేళనం



1997 బ్యాచ్‌మేట్స్ సందడి, చిత్రంలో మంత్రి సీదిరి అప్పలరాజు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల 1997 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సందడి అలరించింది. తమ బ్యాచ్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారందరూ ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఒకటయ్యారు. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియం ఈ సందడికి వేదికైంది. ఇదే బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి మంత్రి సిదిరి అప్పలరాజు శనివారం రాత్రి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రస్ట్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్ రామకృష్ణ, లాస్య ఆసుపత్రి ఎండీ డాక్టర్ త్రిమూర్తుల రాయుడుతోపాటు మరికొందరు వైద్యులు ఆర్గనైజింగ్ కమిటీగా ఏర్పడి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పాల్గొన్నారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ, తన బ్యాచ్ మేట్లందరూ దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉండడం తనకెంతో గర్వంగా ఉందని కొనియాడారు. అమెరికా, యూరోప్, ఆస్ట్రేలియాతో పాటు దేశంలో వివిధ రాష్ట్రాల్లో స్థిరపడ్డ 90 మంది వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ త్రిమూర్తుల రాయుడు తెలిపారు. వైబ్రెంట్ కల్చర్స్ పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందన్నారు.

సినీనటి అనసూయకు బాహుబలి కాజా



బాహుబలి కాజాతో అనసూయ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): టీవీ యాంకర్, సినీనటి అనసూయ భరద్వాజ్‌కు శనివారం సురుచి పీఆర్వో వర్మ బాహుబలి కాజా అందించి సత్కరించారు. పెద్దాపురంలో షోరూమ్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమెకు కాకినాడలోని ఒక హోటల్‌లో ఈ కాజా అందించినట్టు ఆయన వివరించారు. జిల్లాకు ప్రముఖులెవ్వరు వచ్చినా బాహుబలి కాజా అందివ్వడం సురుచి సంప్రదాయమన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ చర్యలు వేగవంతం చేయాలి

కాకినాడ రూరల్: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వేకి సంబంధించి ప్రతాలు పంపిణీ వేగవంతం చేయాలని కాకినాడ ఆర్డీఓ బి.వి.రమణ కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన తహసీల్దార్ మురార్జీ, డీటీ కల్యాణ్, సర్వేయర్ ఆచార్యులు తదితరులతో సమీక్ష నిర్వహించారు. భూ హక్కు పత్రాల పంపిణీలో అశ్రద్ధ వద్దన్నారు. పత్రాల్లో ఏమైనా సవరణలు ఉంటే స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో 42,637 భూ హక్కు పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాకినాడ రూరల్‌లోని 13 రెవెన్యూ గ్రామాల్లో 4572 భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడపగడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పాలనా సంస్కరణలు అమలు చేస్తున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 12వ డివిజన్ నూకాలమ్మ మాన్యం ప్రాంతంలో శనివారం ఎమ్మెల్యే గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా స్థానికులు చెప్పిన పలు సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో పేదల ప్రతి కష్టానికి ఒకొక్క పథకం అమలులో ఉందన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం ఎన్నో పథకాలు సమర్థంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి పనిచేసే ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్‌లు మీసాల ఉదయ్‌కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, నందం, కర్రి శైలజ, డిఈ మాధవీ, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, స్థానిక నాయకులు మట్టపర్తి రఘురామ్, పరశురామ్, జితేంద్రసింగ్, కోనాడ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేమాం 3, 4 అవుట్లను సందర్శించిన స్పెషలాఫీసర్

కాకినాడ రూరల్: హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని నేమాం గ్రామం పరిధిలోని 3, 4 లే అవుట్లను స్పెషలాఫీసర్ డి.సునీత, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ నాగభూషణం తదితరులు శనివారం సందర్శించారు. నేమాం-4లో గృహ నిర్మాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ నేమాం 4 లే అవుట్‌లో విద్యుత్, నీటి సదుపాయం అందుబాటులో ఉందని లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలన్నారు. నేమాం 3లో గృహ నిర్మాణాలు వచ్చే వారం నుంచి మొదలవుతాయన్నారు. గ్రామ సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు లే అవుట్లలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

బాప్టిస్టు సంఘం నూతన కార్యవర్గం

కాకినాడ కల్చరల్: స్థానిక జగన్నాథపురంలోని చారిత్రక బాప్టిస్టు సంఘం నూతన కార్యవర్గం శనివారం ఎన్నికైంది. సంఘ అధ్యక్షుడిగా చిట్టూరి ఏసుదాసు, ఉపాధ్యక్షుడిగా పాలేటి కృపానందం, కార్యదర్శిగా వి.సుధారాణి, సహాయ కార్యదర్శిగా ఎల్.జయప్రకాష్ కుమార్, కోశాధికారిగా డీవీ రమణ, సహాయ కోశాధికారిగా వై.ఏసు, సభ్యులుగా సీహెచ్ సత్యనారాయణ, టి.శ్యామ్‌కుమార్, టి.అప్పారావు, పి.రత్నావళి, ఎస్.విక్టోరియా ఎంపికయ్యారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు అన్నారు. పాస్టర్ రెవ.జి.మోజెస్‌కుమార్ ప్రత్యేక ప్రార్థన చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడ క్రైం: రాష్ట్ర ఆరోగ్య విద్య మీడియా అధికారుల అసోసియేషన్ క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతి ప్రభ శనివారం ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆరోగ్య విద్య మీడియా అధికారులు, ఆరోగ్య విద్యా బోధకులు ప్రజలకు శాఖకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తున్నార న్నారు. వివిధ కార్యక్రమాల అమలు తీరును ఎప్పటికప్పుడు పత్రికల్లో ప్రచురితమయ్యేలా చేసి నూతన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డెమో ప్రసాద్‌రాజు, సత్యవతి, సుధీర్‌తో పాటు హెల్త్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్

కాకినాడ క్రైం: ఆర్టీసీ బస్సులో విజయవాడ నుంచి కాకినాడకు వచ్చిన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అరుణకుమారిని వేధించిన ఆర్టీసీ డ్రైవర్ కేఎస్ బాబును అధికారులు సస్పెండ్ చేశారు. కాకినాడ ఆర్‌టీసీ డిపో మేనేజర్ మనోహర్ ఈ విషయాన్ని నిర్ధారించారు. గత నెల 12వ తేదీ అర్ధరాత్రి కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ అరుణకుమారి విజయవాడ నుంచి కాకినాడకు వస్తుండగా.. డ్రైవర్ మరో నలుగురు యువకులతో కలిసి వైద్యురాలిని వేధించాడు. ఈ నేపథ్యంలో ఆమె దిశ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అదే సమయంలో ఆర్‌టీసీ అధికారులకు తెలపడంతో అంతర్గత విచారణ నిర్వహించారు. విచారణలో డ్రైవర్ కేఎస్ బాబు నిర్వాకం బయటపడటంతో సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. మరోవైపు పోలీసుల విచారణ కొనసాగుతోంది.